
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్టం 39.9 కనిష్టం 26.4

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 8 జూన్ 2024

యథావిధిగా 'ప్రజావాణి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 7: ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండటం వల్ల ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగనుందని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.



• నగరంలో బడిబాట..


• జాన్కంపేట్‌లో



• బుస్సాపూర్‌లో బడిబాట కార్యక్రమం

కొనసాగుతున్న బడిబాట

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం
- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుపై ఉపాధ్యాయుల దృష్టి
- మూతబడిన పాఠశాలలు తిరిగి తెరుచుకునే అవకాశం
- ఈనెల 19 వరకు కార్యక్రమ నిర్వహణ



నిజామాబాద్ అర్బన్, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో విద్యాశాఖ బడిబాట కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడంతో పాటు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనెల 6 నుంచి ప్రారంభమైన బడిబాట కార్యక్రమం ఈ నెల 19 వరకు జరుగనుంది. ఇప్పటికే బడిబాటకు సంబంధించి ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఆయా గ్రామాలలో, మండలాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో 120 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ద్వారా చేర్పుకున్నారు. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో మరింత దృష్టి పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా సమీప పాఠశాలల్లో అనుసంధానం చేసిన పాఠశాలలు ఈ బడిబాట కార్యక్రమం ద్వారా తెరుచుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం సైతం ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు ఉండేలా కార్యచరణ రూపొందిస్తుంది. కొన్ని పాఠశాలలు ఒకే గ్రామంలో రెండు ఉండగా వాటిని గతంలో విద్యార్థులు లేని కారణంగా కలిపి వేశారు. తిరిగి ఈ విద్యా సంవత్సరం ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగితే తెరుచుకునే అవకాశాలు ఉన్నాయి. విద్యాశాఖ సైతం బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగితే ఉపాధ్యాయుల ఖాళీలు కూడా సర్దుబాటయ్యే అవకాశం ఉంది.

ఈనెల 19 వరకు కార్యక్రమాలు..

బడిబాట కార్యక్రమం కోసం విద్యాశాఖ ఈనెల 19 వరకు రోజువారి కార్యక్రమాలను రూపొందించింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక నమోదు, 11వ తేదీన గ్రామసభ, విద్యార్థుల నమోదుపై సమావేశం, ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల ప్రజలతో సమావేశం, 12వ తేదీ అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం, పాఠశాలలను మామిడి తోరణాలు, ముగ్గులతో అలంకరించి పండుగ వాతావరణంలో విద్యార్థులను, తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి సమావేశాలు నిర్వహించడం, 13న విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, 14న విద్యార్థులతో సామూహిక అక్షరభ్యాసం, బాలసభలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పాఠశాల స్థాయిలో పిల్లల కమిటీలు, క్లబ్‌లు ఏర్పాటు చేయడం, 15వ తేదీన సమగ్ర విద్యా దినోత్సవం, బాలికల విద్యపై కార్యక్రమం, ప్రత్యేక అవసరాల పిల్లల నమోదుపై దృష్టి, వివిధ వైకల్యాలతో ఉన్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలలో చేర్పించడం, 18వ తేదీన తరగతి గదుల్లో డిజిటలైజేషన్, ఆంగ్ల మాధ్యమ తరగతులపై అవగాహన, 19న క్రీడా దినోత్సవం నిర్వహించి అన్ని తరగతుల పిల్లలకు వివిధ క్రీడలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

> **విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి..**
>
> **: ఎన్‌వీ దుర్గాప్రసాద్, డీఈవో**
>
> బడి బాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కార్యచరణను రూపొందించడం జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఇతరత్ర సౌకర్యాలను విస్తృతంగా ప్రచారం నిర్వహించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సమిష్టిగా ముందుకు వెళ్తున్నాం. గత ఏడాదికంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచేలా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల వసతులపై ప్రచారం...

ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపుకు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం అంతంత మాత్రంగానే విజయవంతమవుతుంది. కేవలం విద్యార్థులను చేర్పించడమే తప్పితే వారు పూర్తి విద్యాసంవత్సరం పాఠశాలల్లో ఉండేలా ఉపాధ్యాయులు దృష్టి పెట్టడం లేదు. కేవలం విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తే తమ బదిలీలకు ఇబ్బంది ఉండదని, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే తమను ఇతర స్కూళ్లకు ఎక్కడ సర్దుబాటు చేస్తారోనన్న భయంతో విద్యార్థులను నమోదు చేసి తూతూ మంత్రంగానే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్న వాటిని ప్రచారం చేసుకోవడంలో మాత్రం విఫలమవుతున్నారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా వాటిని విద్యార్థులకు తెలియజేయడంలో ఉపాధ్యాయులు విఫలమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న వసతులే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నప్పటికీ విద్యార్థులు మాత్రం అంతంత మాత్రంగానే వస్తున్నారు. మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ప్రభుత్వం మెరుగుపర్చింది. ఇంగ్లీష్ మీడియంలో బోధన, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నభోజనం, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు తదితర వసతుల గురించి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులపై కరపత్రాలు పంపిణీ చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మరింత చొరవ చూపితే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

యూనిఫాంలను పంపిణీ చేస్తున్న డీఆర్‌డీవో పీడీ



స్కూల్ యూనిఫాంల పంపిణీ

డిచ్‌పల్లి: మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను అందజేశారు. పీడీ సాయాగౌడ్ మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభానికి ముందుగానే యూనిఫాంలను విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. డీఆర్‌డీవో ద్వారా తయారు పూర్తయిన తర్వాత యూనిఫాంలను పాఠశాల హెచ్‌ఎంలకు అందజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం డీపీఎం నీలిమ, ఏపీఎం రజిత, సీసీలు పాల్గొన్నారు.



ఫేక్ మెసేజ్‌లతో మోసాలు



- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- అవగాహనలేక మోసపోతున్న అమాయకులు
- సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

బోధన్‌రూరల్, జూన్ 7: జిల్లాలో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. రోజుకో కొత్తతరహాలో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతూ అమాయకులను నట్టేటా ముంచుతున్నారు. బోధన్‌లో ఇటీవల ఆన్‌లైన్ మెసేజ్‌లతో మోసాలు జరిగిన ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. బోధన్ డివిజన్‌లో కొద్ది రోజులుగా ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు తిరుగుతూ వ్యాపార సముదాయాల్లో వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. అయితే నగదు చెల్లించకుండా, దుకాణదారుడి స్కానర్ ద్వారా కొనుగోలు మొత్తం చెల్లించకుండా ఫోన్ నెంబర్‌కు అమౌంట్ వేస్తామంటూ నకిలీ మెసేజ్‌లు పంపి వస్తువులు తీసుకెళ్తున్నారు. ఇలా పలు వ్యాపార సముదాయాల్లో ఘరానా మోసాలకు పాల్పడుతూ తప్పించుకుంటున్నారు. అయితే బాధితులు మెసేజ్‌తో పాటు ఫోన్‌లో ఉన్న బ్యాలెన్స్ చూసుకోవడంతో అమౌంట్ రాకపోవడంతో నకిలీ మెసెజ్ అని గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వీరయ్య మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలు జరిగాయని, వ్యాపారస్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వారిని వెంటనే పట్టుకుంటామన్నారు. సైబర్ నేరాలు పెరిగాయని ప్రజలు ఫేక్ మెసేజ్‌లను నమ్మవద్దన్నారు. వ్యాపారస్తులు తమ బ్యాలెన్స్ చెక్ చేసుకున్న తర్వాతనే వస్తువులను ఇవ్వాలన్నారు. సీసీ ఫుటేజ్‌ల ద్వారా అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని త్వరలోనే సైబర్ నేరాళ్లను పట్టుకుంటామన్నారు.


డి-54 కెనాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

డ్రైనేజీల్లో పూడికను తొలగించాలి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జూన్ 7: జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతాల్లో గల మురుకు కాల్వల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా పూడికతీత పనులు చేపట్టి పూర్తిస్థాయిలో వాటిని శుభ్రం చేయించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపునీరు మురికి కాలువల్లో చేరి పూడికతీత వల్ల ముందుకు వెళ్లే అవకాశం లేక నగరంలో పలు ప్రాంతాలు జలమయమవుతున్నాయని ఆయన అన్నారు. శుక్రవారం కలెక్టర్ నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్‌తో కలిసి నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి డ్రైనేజీ స్థితిగతులను పరిశీలించారు. నిజాంకాలనీలోని డ్రైనేజీ, బోధన్ రోడ్‌లోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మురికి కాలువ, ఖిల్లా రోడ్‌కు ఆనుకొని ఉన్న డి-54 కెనాల్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో నగరంలో ఏ ఒక్క ప్రాంతం కూడా జలమయం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికతో పాటు చెత్తా చెదారం తొలగించాలని ఎక్కడ కూడా వర్షంనీరు నిలువ ఉండకుండా ముందుకు ప్రవహించేలా డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు. భారీ వర్షాలు కురవకముందే డి-సీల్టింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. అవకాశం ఉన్నచోట జేసీబీ వంటి యంత్రాలను వినియోగించాలని వీలు కాని చోట పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించాలన్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ ఇన్‌చార్జి ఈఈ ఆనంద్‌సాగర్, డీఈ వాసుదేవ్, తదితరులు ఉన్నారు.

అమ్మఆదర్శ పాఠశాల పనుల పరిశీలన..

నగరంలోని శివాజీనగర్ ప్రభుత్వ ఉన్నతర ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 5వ తరగతి వరకు కొనసాగుతున్న ఈ పాఠశాలల్లో తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. నీటి వసతిని మెంపొందించేందుకు వీలుగా చేపడుతున్న పనుల నాణ్యతను తనిఖీ చేశారు. మరో నాలుగు రోజుల్లో బడులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పనులను వేగవంతంగా జరిపించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేయించి విద్యార్థులకు వివిధ రకాల ఆటలు ఆడుకునేందుకు క్రీడామైదానంగా వినియోగించుకోవాలన్నారు. దీనివల్ల మైదానంలోకి ఇతర విషపురుగులు వంటి బెడద కూడా తగ్గుతుందన్నారు. కలెక్టర్ వెంట ఈఈ దేవిదాస్, ఏఈ ఉదయ్‌కిరణ్ ఉన్నారు.



'ఉపాధి'లో మహిళలే అధికం!



- ఉపాధి పనుల్లో పెరుగుతున్న మహిళా కూలీల సంఖ్య
- ఏడాదిపొడవునా లభిస్తున్న ఉపాధి హామీ పనులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



డొంకేశ్వర్, జూన్ 7: జిల్లాలో చేపడుతున్న ఉపాధి హామీ పథకంలో మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో హరితహారం నర్సరీల నిర్వహణ మొక్కల సంరక్షణ తదితర పనులను ప్రభుత్వం ఈజీఎస్ కూలీలతోనే చేస్తుండడంతో ఏడాది పొడవునా వారికి ఉపాధి లభిస్తుంది. పలుకు పారా పట్టుకుని పురుషులతో పాటు మహిళలు సైతం కూలీ పనులకు వెళ్తున్నారు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకొని కుటుంబ పనులు చేసుకుంటున్నారు. మరికొందరు మహిళలు ఉదయం ఈజీఎస్ పనులకు వెళ్లి త్వరగా ముగించుకొని తర్వాత సొంత వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పనుల్లో మెట్ల కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు సదరు పనుల్లో పురుషులను వినియోగించగా ప్రస్తుతం మహిళా కూలీల సేవలను వినియోగించుకుంటున్నారు. గతంలో కూలీల్లో ఒక్క సీనియర్ మెట్‌గా బాధ్యతలు చేసేవారు. ప్రస్తుతం హబిటేషన్ ఒక్కరిని నియమించారు. ఎక్కడైనా మహిళలు అందుబాటులో లేనప్పుడు మగవారికి అవకాశం కల్పించారు.

ఏడాది పాటు పనులు..

గతంలో వేసవికాలంలో పనులు అధికంగా ఉండేది. కానీ ప్రతీ పనికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవడంతో ఏడాదికి మొత్తం చేతినిండ పని ఉంటుంది. వానాకాలంలో హరితహారం మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం ఇలా ప్రతీ పథకం లోను ఈ ఉపాధి కూలీలకు వినియోగిస్తున్నారు. డొంకేశ్వర మండల వ్యాప్తంగా మొత్తం 2100 ఉపాధి హామీ కూలీలు ఉండగా వీరిలో మగవారు 647మంది ఉండగా అందులో మహిళలు 1453ఉన్నారు. కాగా, గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు హాజరయ్యేలా మహిళలను ప్రోత్సహిస్తున్నామని ఏపీవో సవిత తెలిపారు.

ఊరిలోని ఉపాధి : సాహితి (పల్లికొండ)



మా గ్రామంలో రెండు నెలల నుంచి ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని వ్యవసాయ పనులకు మట్టి రోడ్డు వేయిస్తున్నాం. దీంతో ఊరిలోనే ఉపాధి దొరుకుతోంది.

రోజూ వెళ్తున్నాం : రేవతి (నూత్‌పల్లి)



మా ఊరిలోనే ఉపాధి పనులు ఉండడంతో ప్రతీ రోజు పనులకు వెళ్తున్నాం. చేతనిండా పని దొరుకుతుంది. పురుషులతో సమానంగా పనిచేస్తున్నాం.





ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతుల ఆందోళన

● ఎత్తొండ సొసైటీకి తాళం వేసిన రైతులు



ఎత్తొండ సహకార సంఘం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కోటగిరి, జూన్ 7: గత రబీ సీజన్‌లో సహకార సంఘం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బులు చెల్లించాలంటూ సహకార సంఘానికి తాళం వేయడం గమనార్హం. కోటగిరి మండలంలోని ఎత్తొండ సహకార సంఘానికి శుక్రవారం రైతులు తాళం వేశారు. సహకార సంఘం పరిధిలో సుమారు 120మంది రైతులు యాసంగి పంటను పండించి తమ ధాన్యాన్ని సహకార సంఘానికి విక్రయించారు. మూడు నెలలు కావస్తున్న ధాన్యం డబ్బులు చెల్లించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 2కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని రైతులు తెలిపారు. డబ్బుల విషయంలో అటు పాలకవర్గం, ఇటు అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో సహకార సంఘానికి తాళం వేసి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కోటగిరి తహసీల్దార్ సునీత ఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డబ్బులు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. విండో కార్యదర్శి సంతోష్ అందుబాటులో లేకపోవడంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, బడిబాట కార్యక్రమంపై అవగాహన

ఎడపల్లి, జూన్ 7: మండలంలోని జానకంపేట గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడి బడిబాటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయరాణి మాట్లాడుతూ.. 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలను అంగన్‌వాడా కేంద్రాలకు పంపాలని, అంగన్ వాడీ కేంద్రాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వరకు విద్యార్థులకు విద్యాబోధన అందించడం జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి ఆటలతో పాటు విద్యాబోధన నేర్పబడుతుందని, తప్పకుండా 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని పిల్లల తల్లిదండ్రులకు ఆమె అవగాహన కల్పించారు.



జానకంపేటలో అంగన్‌వాడీ బడిబాటపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చదువుకునే పిల్లలను

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి..

ఎడపల్లి: చదువుకునే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎడపల్లి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు అన్నారు. ఈనెల 6వ తేదీనుండి 11 వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థుల, బడి బయటి పిల్లల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఇతర పాఠశాలలో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్, ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తూ హెల్త్ క్యాంపులు నిర్వహించడం, శారీరక ఎదుగుదలకు క్రీడల నిర్వహణ చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు బోధన్ విద్యార్థులు

బోధన్ రూరల్, జూన్ 7: తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్టేట్ క్రీడా పోటీల ఎంపికలో బోధన్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. మే నెల 31నుంచి జూన్ 1వరకు రెండు రోజుల పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజారామ్ స్టేడియంలో అండర్ 8, 10, 12, 14, 16, 18 విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బోధన్‌కు చెందిన ఫిట్‌నెస్ అండ్ అథ్లెటిక్స్ క్లబ్ బోధన్ శిక్షణ సంస్థ విద్యార్థులు స్టేట్ లెవల్ కాంపిటేషన్‌కు అండర్ 8విభాగంలో 50మీటర్ రన్నింగ్ రేసులో శ్రేయన్ష్ ఎంపికవడం జరిగింది. అండర్ 10బాలికల విభాగంలో 80,300 మీటర్స్ రన్నింగ్ రేసులో టీ.మోక్ష, అండర్ 12 బాలుర విభాగంలో 400 మీటర్స్ పరుగు పందెంలో శివ స్నేహిత్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఎంపికలో భాగంగా ఈ నెల6న హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో అండర్ 12 జావాలింగ్ త్రోలో విఘ్నేశ్వర్ రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్‌ను సాధించినట్లు సంస్థ నిర్వాహకులు రెహాన్ తెలిపారు.



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

'మన ఊరు- మన బడి పనుల బిల్లులు చెల్లించాలి'

నవీపేట, జూన్ 7: గత ప్రభుత్వ హయంలో మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు, మన బడి పేరుతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని నిజాంపూర్ ఎంపీటీసీ కృష్ణ మోహన్ రావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు గత ప్రభుత్వ హయంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికి విడుదల కాలేదని అన్నారు. నవీపేటలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఆట స్థలం కేటాయించాలని మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఇండ్లపై ఉన్న హైటెన్షన్ వైర్లను తొలగించాలని నవీపేట ఎంపీటీసీ2 మీనా కోరారు. మండలానికి మంజూరైన ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ప్రస్తుతం నిజామాబాద్‌లో కొనసాగుతుందని వెంటనే సంబంధిత పాఠశాలలను మండల కేంద్రానికి తరలించాలని మోకన్‌పల్లి ఎంపీటీసీ జనార్దన్ కోరారు. మండలంలో రాత్రిపూట అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయని వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ హరీష్ కుమార్ కోరారు. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అబ్బాపూర్ ఎంపీటీసీ సాయిలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జడ్పీటీసీ సవిత, వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగనాథ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ఏర్గట్ల మండల సమావేశం

ఏర్గట్ల, జూన్ 7:మండల కేంద్రంలోని రైతువేదిక శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులు పనులపై చదివి వినిపిం చారు. ఎంఈవో ఆంధ్రయ్య మాట్లాడుతూ.. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లు ఇప్పటికే పాఠశాలలకు చేరాయని, ఏకరూప దుస్తువులు మండల సమాఖ్య మహిళా గ్రూప్‌ల ద్వారా సిద్ధం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, వైస్ ఎంపీపీ లావణ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఆశ్రఫ్, ఎంపీటీసీ మధు సుధన్, తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం శ్యామ్, ఎంపీవో శివచరణ్, తదితరులు పాల్గొన్నారు.

చదువే అభివృద్ధికి మలుపు



● మగ్గిడిలో గ్రామస్థులకు ప్రభుత్వ పాఠశాలలో వసతులు వివరిస్తున్న పాఠశాల హెచ్‌ఎం

మెండోర, జూన్7:చదువు మానవుని జీవిత చరిత్రకు మలుపు లాం టిదని బడిఈడు పిల్లలకు బడిలోనే ఉండాలని బుస్సాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అన్నారు. శుక్రవారం బుస్సాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు సకల వసతులు కల్పిస్తున్నామని, మధ్యాహ్నభోజన పథకం లాంటి బృహత్తర పథకా లను అమలు చేస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడిబాటకు పెద్దపీట వేసిందని, పిల్లలందరు ప్రభుత్వ పాఠ శాలల్లోనే చదువుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు రాజేశ్వర్, విజయక్మి, అంగన్‌వాడి ఉపాధ్యాయురాలు స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యా యులు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు నుండి 14 సంవత్స రాల పిల్లలను తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభు త్వ పాఠశాలలో కల్పి స్తున్న వసతులు, పథకాలు, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు వివరిం చారు. విద్యార్థులకు ఉచితంగా అందజేసే డ్రెస్సు లు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై ఉపాధ్యాయులు వివరించారు .కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు శేర్ల శ్రీనివాస్, కృష్ణప్రసాద్, మురళి, పిట్ల నవీన్‌లు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యా యులు ఇంటింటికి తిరిగి బడి బయట పిల్లను గుర్తించి బడిలో చేర్పించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించిన సమా వేశంలో ప్రధానో పాధ్యాయురాలు హరిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విజే తతో పాటు అన్ని వసతులు అందజేస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రైవేటు పాఠశాలలో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిం చాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మధు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్:ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అధికారులకు సూచన లు చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం స్కూల్‌లో ఉన్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని ఎంఈవో స్వామి తెలిపారు. 5 సంవత్సరాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబు, ఏపీఎం రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఘన్‌పూర్‌లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యా యులు శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని గ్రామస్థులను కలిసి ష్టి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్‌కి దీటుగా విద్యాను డిజిటల్ తరగతుల ద్వారా అందిస్తున్నమని నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని, ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేయడం జరుగుతుందని, కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఇందుకు గ్రామస్థులు సానుకులంగా స్పందించారని ఉపాధ్యాయులు తెలిపారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని తొర్లికొండ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తున్న వద్దకు వెళ్ళి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఉదయం రాగిజావా, కంప్యూటర్ విద్య, వివిధ విద్య అంశాలపై ఉపాధి కూలీలకు ఆయన అవగాహన కల్పిస్తూ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించి చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం జంగం అశోక్, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ఇంటింటికి సర్వే చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చేరని వారిని గుర్తించి పిల్లలను చేర్పించుకునే కార్యమం నిర్వహించారు. అందులో భాగంగానే ఆయా గ్రామాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి సర్వే నుంచి పిల్లలను గుర్తించి ప్రభుత్వం పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశవర్కర్‌లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చేపల విక్రయాలు

డొంకేశ్వర్, జూన్ 7: మృగశిర కార్తె మీరుగు సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. రైతులు జోరుగా చేపలు, మామిడిపండ్ల విక్రయాలు సందడిగా మారిన మార్కెట్లు రుతు సంబంధమైన మృగశీరకార్తె (మిరుగు) పండగను మండలంలో ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రైతులు వ్యవసాయ పనులను ప్రారంచడానికి జరుపుకునే పండగ కావడంతో అన్నదాతలు మృగశీర ప్రవేశ సమయంలో ప్రకృతి అరాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొన్ని చోట్ల విత్తనాలు వేశారు. మిరుగు రోజు చేపలు, మామిడిపండ్లు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో మార్కెట్‌లో చేపలు, పండ్లకు గీరాకి పెరిగింది. చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఈ ఏడాది చెరువుల్లో నీళ్లు నిండుగా ఉండడంతో గ్రామాల్లోనూ చేపలు పుష్కలంగా లభించాయి.

మెండోర: మృగశీర కార్తె మిరుగు రోజును పురస్కరించుకొని శుక్రవారం మండలంలో చేపల అమ్మకాలను జోరుగా సాగాయి. ఈ సందర్భంగా ప్రతీ ఏడాది మిరుగు రోజు చేపల కూర వండుకోవడం గ్రామాల్లో ఆనవాయితీగా వస్తోంది. దీంతో మత్స్యకారులు గ్రామ ఊరచెరువుల్లో చేపలను పట్టి విక్రయాలు జరిపారు. మెండోర, కోడిచర్ల, బుస్సాపూర్, సావెల్, వెల్కటూర్, దూదిగాం గ్రామాల్లో ప్రజలు చేపలను భారీగా కొనుగోలు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఆరేళ్ల చిన్నారి మృతి

ఆర్మూర్‌టౌన్ , జూన్7:ఆలూర్ మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌తో సింధూర అనే ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సౌందర్య, మనీష్ దంపతులు పనిమీద వెళ్లడంతో.. వారి ఇద్దరు కూతుళ్లను అమ్మమ్మ లావణ్య ఇంట్లో వదిలివెళ్లారు. సాయంత్రం ఇంట్లో ఆడుకుంటూ పిల్లలతో సింధూర కూలర్‌ను తాకడంతో కూలర్‌కు విద్యుత్‌సరఫరా అయి మృతిచెందింది. వెంటనే ప్రైవేటు ఆసు పత్రికి తరలించగా.. అప్పటికే చిన్నారి మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

ఆర్మూర్‌లో చిరువ్యాపారులకు తోపుడు బండ్ల వితరణ

ఆర్మూర్‌రూరల్, జూన్7:ఆర్మూర్‌లోని చిరు వ్యాపారులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శుక్రవారం తోపుడు బండ్లను వితరణ చేశా రు. రోటరీ పిడి జీ.హన్మంత్‌రెడ్డి తన తండ్రి వెంకట్‌రెడ్డి స్మారకార్థం రూ.లక్ష 60వేల విలువ చేసే తోపుడు బండ్లను సమకూర్చగా వాటిని చిరువ్యాపారులకు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లా డుతూ జీవనోపాధి కోసం చిరువ్యాపారం చేసుకుంటున్న నిరుపేదలకు సొంతంగా బండి లేని వారికి తమవంతు సహకారం అందించడానికి పది మంది వ్యాపారులకు తోపుడు బండ్లను వితరణ చేశామన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వా రితులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, కాంతి గంగారెడ్డి, విజయ సారథి, చరణ్‌రెడ్డి,, పద్మ, మురళీ, పుష్పకర్‌రావు, రాజేందర్, రాంప్రసాద్, వినాయక్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

డిచ్‌పల్లి, జూన్ 7:తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష, మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నిజామాబాద్ ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఆర్మూర్ లోని నరేంద్ర పరీక్ష కేంద్రంలో ఒకరు చూచి రాతలకు పాల్పడుతూ డిబార్ అయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంటచంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని 38పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షలకు 6086 అభ్యర్థులకు గాను 5670 మంది హాజరుకాగా 414 విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 3050 మంది విద్యార్థులకు గాను 2840 పరీక్షకు హాజరయ్యారన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

● వ్యవసాయాధికారిణి పద్మ



● బాల్కొండ సొసైటీలో ఎరువులను తనిఖీ చేసి ఏవో మహేందర్

మాక్లూర్ , జూన్ 7: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారిణి పద్మ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్, స్థానిక ఎస్సైలతో కలిసి ఫర్టిలైజర్‌షాప్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన దుకాణాల్లో రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడే తప్పకుండా రశీదు ఇవ్వాలని ఆమె సూచిం చారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదిత రులున్నారు.

ముప్కాల్,: విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి మహేందర్ తెలిపారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో తనిఖీ చేశారు. కాంప్లెక్స్ ఎరువులు, యూరియా తగినంత స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని డీలర్‌లకు సూచించారు. ప్రస్తుతం మండలంలోని సొసైటీ ద్వారా 1400బస్తాల యూరియా, 2వేల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు ప్రైవేటు దుకాణాల ద్వారా 2200యూరియా, 1100 కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల దుకాణదారులు స్టాక్ రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు పొందుపర్చుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దను విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. లైసెన్స్ లేకుండా నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో గూడ్స్ రైలు ఢీకొని యువకుడి మృతి

మోర్తాడ్, జూన్7: మోర్తాడ్ ట్రాక్‌పై గూడ్స్ బండి ఢీకొని పాల్ద సంతోష్ (20) అనే యువకుడు మృతి చెందినట్టు రైల్వే పోలీస్ అధికారి హన్మండ్లు తెలిపారు. మోర్తాడ్‌లోని గోవింద్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్న సంతోష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మృతుడు స్నేహితుడితో కలిసి వస్తుండగా గూడ్స్ బండి ఢీకొట్టింది. దీంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడని ఆయన వెంట తీవ్ర గాయాలతో పడిపోయాడని పోలీసు అధికారులు తెలిపారు. గాయపడ్డ యువకుని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించామని, మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని రైల్వే పోలీస్ అధికారి హన్మండ్లు తెలిపారు.



మృతి చెందిన సంతోష్

కేదారీనాథ్ వెళ్లిన కౌల్‌పూర్ ఆశ్రమం సభ్యులు

నందిపేట, జూన్7:మండల కేంద్రంలోని కౌల్‌పూర్ గ్రామా పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ పరమహంస శ్రీ భూమయోగేశ్వర ఆశ్రమం నుంచి ఉత్తరఖండ్ రాష్ట్రంలోని బద్రీనాథ్ ఆలయం వరకు చేపట్టిన సభ్యులు శుక్రవారం కేదారీనాథ్‌లోని జ్యోతిర్లింగాన్ని దర్శించుకున్నారు. ఆశ్రమం సభ్యులు చేపట్టిన పాదయాత్ర 74వ రోజుకు చేరుకుంది. 2024 మార్చి 24న ఆశ్రమం నుంచి వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన కాలి నడక 1900 కిలో మీటర్లకు సొగా దాటింది. శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం సభ్యులు గంగోత్రి, యమునోత్రి దర్శనాలు చేసుకొని తిరుగు ప్రయాణం చేస్తామని ఆశ్రమ వ్యవస్థాపకులు చింత రమేష్ తెలిపారు. కార్యక్రమంలో రూపాదేవి, గజ్జెల సత్యనారాయణ, వాల్మీకి నర్సయ్య, రాజేశ్వర్, పార్థ సారథి, సత్యం, ఎంబేరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ముగింపు



చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్, జూన్7 : పట్టణంలోని నటరాజ నృత్యనికేతన్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెల రోజుల నుంచి వేసవి సెలవులు చిన్నారుల నాట్య శిక్షణను తీసుకున్న చిన్నారులకు శుక్రవారం రాష్ట్రపతి అవార్డు గ్రహిత మాడవేటి నారాయణ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాట్యగురువు బాశెట్టి మృణాళిని, మిమిక్రి కళాకారుడు కోకిల నాగరాజు, చిన్నారులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న చైర్‌పర్సన్ దంపతులు

ఆర్మూర్‌టౌన్, జూన్7: ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ కుటుంబసభ్యులు తిరుపతిలోని వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య దైవదర్శనం నిమిత్తం తిరుపతిలోని వెంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా వెళ్లి మొక్కులను తీర్చుకుని తలనీలాలను సమర్పించినట్టు ఆమె తెలిపారు.

దోస్త్ మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి

డిచ్‌పల్లి,జూన్7:తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీకళాశాలలో 2024-25 ప్రవేశాలకు నిర్వహించే దోస్త్ మొదటి విడతలో సీట్ల కేటాయింపు శుక్రవారం పూర్తి అయిందని దోస్త్ కో-ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఒక ప్రకట నలో తెలిపారు.8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిధిలో 2880 సీట్లకు గాను 212 భర్తీ కాగా,5 అటనమాస్ కళాశాలలో పరిధిలో 4680 సీట్లు ఉండగా 1826 మంది విద్యార్థులు దోస్త్‌ప్రక్రియ ద్వార సీటు సాధించారని ఆయన పేర్కొన్నారు. తెలిపారు. 48ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిధిలో 22670 సీట్లలో 2608 విద్యార్థులు ప్రవేశం పొందారని దోస్త్ కో-ఆర్డినేటర్ సంపత్ కుమార్ ఈ సందర్భంగా వివరించారు.

బాలురు వాహనాలు నడిపితే జరిమానా

● 10 వాహనాల స్వాధీనం ● సీజ్ చేసిన అధికారులు

జక్రాన్‌పల్లి, జూన్7: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామ పరిధిలోని గాంధీనగర్‌లో ఆర్మూర్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకా నందరెడ్డి, స్థానిక ఎస్సై సీహెచ్.తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. నెంబర్‌ప్లేట్ లేని వాహనాలను, మైనర్ డ్రైవింగ్ వాహనాల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. పది వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించామని తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియామలు పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు నడుపుమని ఇవ్వరాదని, ఏమైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులే బాధ్యత అని, రోడ్డు భద్రత నియామలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్రాన్‌పల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను సీజ్ చేసిన అధికారులు


మాట్లాడుతున్న వినియోగదారుల ఫోరం చైర్మన్

ఆహారంలో కల్తీ జరిగితే సమాచారం ఇవ్వాలి

ఖిల్లా, జూన్ 7: ఆహార పదార్థాల్లో కల్తీ చేసి విక్రయించినట్లయితే వినియోగదారులు ఫోరంకు సమాచారం ఇవ్వాలని వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు మాయావర్ రాజేశ్వర్ అన్నారు. ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని రైతుబజార్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆహార పదార్థాలు కొనే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పండ్లు, పాలు, తాగే నీరు, కిరాణం వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండి వాటిలో కల్తీని గుర్తిస్తే వ్యాపారస్తుల నుంచి బిల్లును తీసుకోవాలని తెలిపారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెట్రోలజీ టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్‌రావు, వినియోగదారుల ప్రతినిధులు డి.రమేష్, ఎం.సత్యనారాయణ, జిల్లా ఆహార భద్రత కార్యాలయ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన రెవెన్యూ ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 7: రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల దృష్ట్యా బదిలీ చేసిన తహశీల్దార్లను, నాయబ్ తహశీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని వీఆర్‌వోలను తిరిగి రెవెన్యూ శాఖకు కేటాయించాలని కోరారు. సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే గత కొన్నేళ్లుగా తహశీల్దార్లను వారి పూర్వ జిల్లాలకు, స్థానాలకు బదిలీ చేసే ఆనవాయితీ ఉందని కావున వెంటనే బదిలీలు చేయాలన్నారు. గత ఎన్నికల్లో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు లేని కారణంగా ఎన్నికల నిర్వహణలో తీవ్ర సిబ్బంది కొరతను ఎదుర్కోవడం జరిగిందని, వీఆర్‌ఏల కారుణ్య నియామకాలు, సొంత జిల్లాలకు వారి బదిలీలు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి తహశీల్దార్ల బదిలీలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వీఆర్‌ఏ, వీఆర్‌వోల సమస్యలపై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇందల్వాయి, జూన్ 7: ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. రైతులు డీలర్లకు విక్రయించే విత్తనాల వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎరువులు, పురుగు మందులు తీసుకునేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సీల్ చేసిన బ్యాగులను మాత్రమే తీసుకోవాలని లూజ్ సంచులను ఎప్పుడూ తీసుకోవద్దన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా దుకాణాదారుడి నుండి రసీదులు తీసుకోవాలని తెలిపారు. దుకాణాలలో ఏవైనా నకిలీ విత్తనాలు ఉన్నాయా అని వారు తనిఖీ చేశారు. నాసిరకపు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల జాబితా విడుదల

ధర్పల్లి, జూన్ 7: ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ రాజేందర్ సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు బోనాఫైడ్, ప్రోగ్రెస్ రిపోర్ట్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలను పాఠశాలలో సమర్పించాలని ఆయన సూచించారు. సకాలంలో ఎంపికైన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించలేకపోతే సీటు కోల్పోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో ఉంచిన మెరిట్ లిస్ట్ ఆధారంగా సంబంధిత సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 7: మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగినిలకు నగరంలోని సుభాష్‌నగర్ లోగల ఓల్డ్ ఎన్‌జీవోస్ కాలనీలో వసతిగృహం ప్రారంభించడం జరిగిందని కావున ఆసక్తిగల ఉద్యోగినిలు, విద్యార్థినిలు వసతిగృహంలో ఉండేందుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారిణి రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. వసతిగృహంలో ఉండేందుకు నెలవారి చెల్లింపులతో అవకాశం ఉందని ఆసక్తిగల వారు 9603925140 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జనసేన నాయకుల ముందస్తు అరెస్టు

నిజామాబాద్ అర్బన్, జూన్ 7: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా జిల్లాకు చెందిన జనసేన నాయకులు శుక్రవారం నగరంలో నిర్వహించతలపెట్టిన బైక్ ర్యాలీని పోలీసులు అనుమతించలేదు. బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని జిల్లా ఇంచార్జి గుండా సంతోష్ ఏసీపీని కలిసి అనుమతి కోరినప్పటికీ బైక్ ర్యాలీ నిర్వహణకు అనుమతి ఇవ్వకుండా నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారని సంతోష్ తెలిపారు. అనుమతి కోరినప్పటికి పోలీసులు తమను అరెస్టు చేయడం సరికాదని ఆయన అన్నారు. అరెస్టైన వారిలో శ్రీరాం, కిరణ్, వంశీ, పవన్, వివేక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పూడికతీత పనులు చేపట్టాలి

● మున్సిపల్ అధికారులతో మేయర్ సమీక్ష

సుభాష్‌నగర్, జూన్ 7: రానున్నది వర్షాకాలం కావడంతో నగర శివారులోని లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా కాల్వలో పూడికతీత పనులు చేపట్టాలని నగర మేయర్ దండునీతూకిరణ్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమీషనర్ మంద మకరంద్, రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, సానిటేషన్ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు అధికంగా కురిస్తే వర్షపునీరు లోతట్టు ప్రాంతాలకు చేరకుండా నీటిని మళ్లించేందుకు తాత్కాలిక నాలాలు ఏర్పాటు చేయాలన్నారు. నగర శివారు ప్రాంతాల్లో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో 24 గంటలు లైట్లు వెలుగుతున్నట్లు దృష్టికి వచ్చిందని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రారంభించిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని అన్నారు. అక్రమ కులాయి కనెక్షన్ల సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లలో మరమ్మతులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలని క్రీడాప్రాంగణాల్లో వసతులు ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

ఉన్న నిర్మాణాలు గుర్తించి ప్రమాదం జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. నగరంలో చెత్త నిర్వహణ ఆశించిన మేర జరగడం లేదని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. డంపింగ్ యార్డులో చేపడుతున్న బయోమైనింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. నివాస యోగ్య అనుమతులు పొంది వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్న భవనాలను గుర్తించి మున్సిపాలిటీ పన్ను, ఎగవేత దారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ శంకర్, రెవెన్యూ అధికారి నరేందర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ, డిప్యూటీ ఇంజనీర్లు ఆనంద్‌సాగర్, ముస్తక్ అహ్మద్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇంజనీర్లు, సానిటరి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

అభ్యర్థుల హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలి

● గ్రూప్-1 పరీక్షపై శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్, జూన్ 7: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణపై అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈనెల 9న ఉదయం 10.30ల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పరీక్ష కేంద్రాల వద్ద ప్రవేశ ద్వారం వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లను తనిఖీ చేయడానికి, నిర్దేశిత అభ్యర్థులు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించేందుకు వీలుగా ప్రతి కేంద్రం వద్ద 50 మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఈనెల 9న తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు అధికారులు ఉదయం 7గంటలకే చేరుకొని చీఫ్ సూపరింటెండెంట్‌కు రిపోర్ట్ చేయాలని సీఎస్‌లతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్ష నిర్వహణ కోసం అవసరమైన సహకారాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా నిజమైన అభ్యర్థులే పరీక్షకు హాజరవుతున్నారా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. హాల్‌టికెట్లపై ఇటీవలి ఫోటో అతికించబడిందా లేదా అన్నది గమనించాలని ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ లాంటివి తనిఖీ చేసి హాల్‌టికెట్‌తో సరిచూసుకొని వాస్తవ అభ్యర్థినే పరీక్షకు హాజరవుతున్నట్లుగా నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. హాల్‌టికెట్‌పై ముద్రించిన ఫోటో అస్పష్టంగా ఉంటే రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ కూడా సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుపోవడానికి అనుమతి లేదన్నారు. ఇన్విజిలేటర్లు, పరిశీలకులు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించేలోపే పరీక్ష కేంద్రం ప్రవేశం ద్వారం వద్ద సెల్‌ఫోన్‌లను డిపాజిట్ చేయాలని ఎవరైనా నిబంధనలకు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎవరైనా సెల్‌ఫోన్, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు డిబార్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సమన్వయ కర్త రామ్మోహన్, డీఈవో దుర్గాప్రసాద్, డీఐఈవో రవికుమార్, ఏసీ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ముమ్మర తనిఖీలు

బోధన్‌రూరల్, జూన్ 7: బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లోని ప్రైవేటు ఆసుపత్రులను, మెడికల్ షాపులను, ల్యాబ్, స్కానింగ్ సెంటర్‌లను శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య నేతృత్వంలో మెడికల్ ఆఫీసర్లు తనిఖీలు నిర్వహించారు. బోధన్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులతో పాటు బోధన్ లయన్స్ క్లబ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి నిర్వహణ, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. నిబంధనల మేరకు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు డీఎంహెచ్‌వో నుంచి వైద్య, ఆరోగ్య శాఖ నుంచి పొందిన సర్టిఫికెట్లు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, మిగతా కేసులను ప్రభుత్వ దవాఖానాలకు సూచించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.


లయన్స్ క్లబ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌ల తనిఖీ

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం వైద్యశాఖ అధికారులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేశారు. సరైన అనుమతులు లేకపోవడంతో పాటు శిక్షణ లేకుండా క్లినిక్‌లను నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరించడం జరిగిందని సంబంధిత రిపోర్టులను డీఎంహెచ్‌వోకు అందజేయడం జరుగుతుందని వైద్యశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బినోల మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, సూపర్‌వైజర్లు కిషన్, వెంకటేశ్వర్ రావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఇందల్వాయి: మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను శుక్రవారం మండల ఆరోగ్య విస్తీర్ణ అధికారి శంకర్ తనిఖీ చేశారు. పీఎంపీ, ఆర్‌ఎంపీ క్లినిక్‌లలో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని వారి పేరు ముందు డాక్టర్ అని పేరు పెట్టుకోరాదని తెలిపారు. ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని వారు అడిగిన సమాచారం ఇవ్వాలన్నారు. అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులు, డయాగ్నిస్టిక్ సెంటర్లను తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. తిర్మన్‌పల్లి గ్రామంలోని ఫిజియోథెరపి సెంటర్‌ను శంకర్ తనిఖీ చేసి క్లీనిక్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను తీసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాలతో ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు.

చోరీకి యత్నించిన యువకుడి పట్టివేత

నవీపేట,జూన్7: మండల కేంద్రంలోని గ్రంథాలయం సమీపంలో ఉన్న ఓ ఇంటిలో చోరీకి యత్నించిన యువకుడిని సంబంధిత కుటుంబ సభ్యులు పట్టుకుని కిటికీకి కట్టివేశారు. స్థానికులు తెలిపిన ప్రకారం నవీపేటకు చెందిన ఓ మేస్త్రీ వద్ద కూలీగా పని చేస్తున్న ఇద్దరు యువకులు ఇటీవల రాత్రిపూట పలు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. గురువారం రాత్రి సంబంధిత కుటుంబ సభ్యులు ఉక్కపోత భరించలేక తలుపులు తెరిచి ఉంచి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు యువకులు ఇంట్లోకి ప్రవేశించి పర్సులో ఉన్న 7వేల రూపాయలతో పాటు ఒక సెల్‌ఫోన్ తీపుకున్నారు. ఇదే సమయంలో అలికిడి విన్న కుటుంబ సభ్యులు చోరీకి యత్నిస్తున్న ఒక యువకుడి పట్టుకుని కిటికీకి కట్టివేయగా మరో యువకుడు తప్పించుకుని పారిపోయాడు. శుక్రవారం ఉదయం పట్టుబడిన నిందితుడి సమాచారం తెలుసుకుని మరో యువకుడిని కూడా పట్టుకుని ఇద్దరిని నవీపేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. చోరీకి యత్నించిన యువకుడిని స్థానిక మహిళలు చితకబాదారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా చోరీ యత్నానికి సంబంధించి విచారణ జరుపుతున్నామని అన్నారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెద్దబజార్, జూన్ 7: బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి.కేశవులు, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్‌లు అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు రిజర్వేషన్‌లు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి నుంచి కూడా చాలా ప్రధాన పార్టీలు వెనుకబడిన తరగతుల కోసం కొన్ని సంక్షేమ పథకాలు ఇవ్వడం, విద్య, ఉద్యోగాల్లో పోటా పోటీ రిజర్వేషన్ కల్పించడం కొందరు బీసీ నేతలకు కొన్ని అప్రాధాన్యమైన శాఖలు ఇచ్చి తమ ప్రచారానికి వాడుకొని వదిలేశారని అన్నారు. విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ హోదా వంటి అన్ని రంగాల్లో బీసీలు అనాధిగా వివక్షకు గురవుతున్నారని భారీ వివక్షను తొలగించేందుకు అణచివేయబడిన ఈ తరగతులకు ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ నాయకులు అశోక్, శ్రీనివాస్, సబ్బనిలత, వివిధ బీసీ కులాలకు చెందిన నాయకులు సిద్ధయ్య, శంకర్, నర్సింలు, సత్యనారాయణ, గీతాంజలి, శ్రీమాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖిల్లా, జూన్ 7 : జిమ్‌కు వచ్చే వారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా జిమ్ నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని నగర ఇన్స్‌పెక్టర్ నరహరి తెలిపారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు, నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్ రెడ్డి నేతృత్వంలో శుక్రవారం తన పరిధిలో ఉన్న జిమ్ నిర్వాహకులకు తన చాంబర్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. జిమ్‌కు వచ్చే వారు గ్యాంగులుగా ఏర్పడి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మాదకద్రవ్యాల సమాచారం ఉంటే సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా ప్రతి జిమ్ నిర్వాహకులు సీసీ కెమారాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈకౌన్సిలింగ్‌లో రెండు, మూడు, నాలుగు పోలీసు స్టేషన్ల ఎస్ఐలు ఎల్.రాం, ప్రవీణ్‌కుమార్, సంజీవ్, జిమ్ నిర్వాహకులు సత్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం నాయకులు

రేపు పద్మశాలీ వధూవరుల పరిచయ వేదిక

పెద్దబజార్, జూన్ 7: ఈనెల 9న పద్మశాలీ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, పరిచయ వేదిక చైర్మన్ గుజ్జరాజేశ్వరి, పద్మశాలీ ఆత్మీయ సేవాసమితి అధ్యక్షుడు రాపెల్లి గురుచరణ్ అన్నారు. శుక్రవారం నగరంలోని కోటగల్లి లోగల జిల్లా పద్మశాలీ సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పెళ్లి సంబంధాలు అవసరమున్న పద్మశాలీ అమ్మాయి, అబ్బాయిలు బయోడెటాతో నేరుగా కార్యక్రమానికి హాజరుకావాలని వారు సూచించారు. పెళ్లి సంబంధాలు కుదిరిన పేద పద్మశాలిలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ పుల్గం హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి దశరథం, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుడ్ల చంద్రబాగ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్

కోటగిరి, జూన్ 7: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ఆరోగ్య సిబ్బంది తగిన కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని పొతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. వ్యాక్సిన్ భద్రపరిచే ఫ్రిజ్, మందుల స్టోర్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో గడువు తీరిన మందులను ఉంచరాదని సూచించారు. కుక్కకాటు, పాముకాటు ఇంజక్షన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి మండలంలో గర్భిణీల వివరాలు సేకరించాలన్నారు. వారు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యేలా మానిటర్నింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సుప్రియ, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సూపర్‌వైజర్ జ్యోతి, సుమాంజలి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మిగణపతి ఆలయంలో పూజలు


లక్ష్మిగణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

మోపాల్, జూన్ 7: నగరంలోని బోర్గాం(పి) గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మిగణపతి ఆలయంలో శుక్రవారం శ్రీలక్ష్మి మహాయాగంను వేదపండితుల సమక్షంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు లక్ష్మిగణపతి ఆలయం వ్యవస్థాపకులు అరుణ్‌శర్మ తెలిపారు. శుక్రవారం యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, శ్రీ సూక్త పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులతో పాటు నగర భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తూ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్‌శెట్టి శ్రీనివాస్, గజవాడ ఆగమయ్య, చిట్టిమిల్లహరిప్రసాద్, గజవాడ నరేందర్, పవన్, గజవాడ ధర్మరాజు అనేక మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

బోధన్‌రూరల్,జూన్7: నేడు బోధన్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని పంతాలకు పోకుండా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కోర్టుల చుట్టు తిరుగుతూ సమయం వృథా చేసుకోవద్దని మంచి మనసుతో ఆలోచించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,400	రూ.67,700	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.20, 10.20)
: ముంజియా (హిందీ) (1.35)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (4.20)
: సత్యభామ (7.25)
స్క్రీన్-2 : బ్యాడ్ బాయ్స్ (10.30, 4.30, 10.30)
: మనమే (1.15, 7.15)
స్క్రీన్-3 : సత్యభామ (11.25, 10.40)
: భజే వాయువేగం (2.20)
: వెపన్ (5.15) : ముంజియా (హిందీ) (7.55)
స్క్రీన్-4 : గోల్డ్ నెంబర్-1 (10.30)
: లవ్ మౌళీ (1.20)
: గంగం గణేషా (4.25) : రక్షణ (7.30)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.50, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 : రక్షణ (10.25)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.30)
: సత్యభామ (4.30) : భజే వాయువేగం (10.30)
స్క్రీన్-3 : లవ్ మౌళీ (10.40) : బ్యాడ్ బాయ్స్ (1.45, 7.45) : వెపన్ (4.40)
: సత్యభామ (10.30)
దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రక్షణ (11.00, 6.00)
: వెపన్ (2.00, 9.00)
విజయ్ : మనమే (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్